ప్రజాశక్తి
సోమవారం 4 నవంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు

## జనావాసాల్లో మద్యం దుకాణాన్ని తొలగించాలి

**ప్రజాశక్తి-అరకులోయ రూరల్:**అరకులోయ మండల కేంద్రంలోని పెదలబుడు పంచాయతీ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణ షాపును తొలగించాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ఆదివారం అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు గెమ్మెలి చిన్నబాబు, కిల్లో జగనాదం, కొర్రా మగ్గన్న, తాంగుల హరి మాట్లాడుతూ, అరకులోయ మండల కేంద్రంలోని తాగునీరు అందుబాటులో ఉండలేదని, మద్యం దుకాణం వీధి వీధికి పెట్టి తాగుబోతులుగా తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని విమర్శించారు. ఆదివాసుల ఆరోగ్యం పట్ల ఈ ప్రభుత్వానికి లెక్కలేదని, దానికి తోడు అధికారులు ప్రజాప్రతినిధులు చూసి చూడనట్టుగా వ్యవహరించడం సరికాదన్నారు. రాత్రి వేళలో మహిళలు, విద్యార్థులు రాకపోకలు అయ్యే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో మందుబాబులతో ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

### -సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.కోటేశ్వరరావు

**ప్రజాశక్తి పాడేరు:-** కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రభుత్వాలపై పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, జి కోటేశ్వరరావు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు అల్లూరి జిల్లా కమిటీ, ప్రజా సంఘాల సంయుక్త సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ అధ్యక్షతన సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోటేశ్వరరావు మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి కార్మిక స్థితిగతులు, సమస్యలపై రాతపూర్వకంగా ముఖ్యమంత్రికి విన్నవించడం జరిగిందన్నారు. కార్మికుల కష్టం శ్రమ లేకుండా ఏ వస్తువు తయారవ్వలేదని, అటువంటప్పుడు వారికి ఇచ్చే జీతాలలో హెచ్చు తగ్గులు ఎందుకని ప్రశ్నించారు. కార్మికుల మధ్య చీలిక విభజించి ప్రభుత్వాలు పాలిస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులు శ్రామికులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటానికి సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రోజు రోజుకి నిరుద్యోగ సమస్య పెరుగుతుందని, దానికి తగ్గట్టుగా ప్రభుత్వాలు యువతని ఎలా ఉపయోగించుకోవాలో తెలియలేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడవలసిన ప్రభుత్వాలు ప్రైవేట్ చేతుల్లో అప్పు చెప్పుదని పనిచేస్తున్నాయని మండిపడ్డారు. గ్రామ వార్డు వాలంటీర్లకు బకాయి పడ్డ 5 నెలల జీతాలు విడుదల చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయి ప్లాంటేషన్ కండక్టర్లు, కాఫీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ఎల్.సుందర్రావు, సన్నిబాబు, ఎస్పి పోతురాజు, జి.సత్యనారాయణ, భాగ్యలక్ష్మి, ఎస్.నాగరాజు, శంకర్రావు, దీనబంధు, వై.అప్పలనాయుడు, మోస్య, జయరాజు, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు

బాలింతను నడిచి తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు

### శస్త్రచికిత్స నొప్పిని భరిస్తూ

## రెండు కిలోమీటర్లు నడిచిన బాలింత

**ప్రజాశక్తి -అనంతగిరి:**విశాఖ కేజీహెచ్‌లో డెలివరీ అనంతరం బాలింతను అంబులెన్స్ సిబ్బంది ఆదివారం మార్గమధ్యలో రోడ్డు బాగో లేక పోవడంతో దించి వెళ్లిపోవడంతో ఆ బాలింత కుటుంబ సభ్యుల సహకారంతో రెండు కిలోమీటర్ల మేర కొండ కోనల నడుమ నుండి నాలుగు గంటల పాటు నడిచింది. అనంతగిరి మండలం మారుమూల పినకోట పంచాయతీ పరిధి వాజంగి గ్రామానికి చెందిన తామర్ల. జ్యోతి. పురిటి నొప్పులతో బాధపడుతూ ప్రసవం కష్టతరం కావడంతో కుటుంబ సభ్యులు గత వారం రోజుల క్రితం విశాఖ కేజిహెచ్‌కు తరలించారు.ఆపరేషన్ నిర్వహించగా బిడ్డ ప్రసవించింది. వైద్య సేవలు అనంతరం వైద్యులు డిశ్చార్జ్ చేయడంతో ఆదివారం తల్లి బిడ్డ అంబులెన్స్ సిబ్బంది బలగరువు మెయిన్ రోడ్డులో దించి వెళ్లి పోవడంతో సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో బాలింత అతి కష్టం మీద గ్రామానికి చేరింది. సరైన రోడ్డు సౌకర్యం లేక పోవడంతోనే అంబులెన్స్ గ్రామానికి రాలేని పరిస్థితి నెలకొంది.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

## విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

### - ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం ఆదేశం

**ప్రజాశక్తి-రంపచోడవరం**

ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యతోపాటు ఆరోగ్యంపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని కాకివాడ గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం రాత్రి ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎవరైనా అనారోగ్యంతో ఉంటే వెంటనే ఆస్పత్రులకు తరలించి వైద్య సేవలు అందించాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పాలన్నారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో లెసన్ ప్లాన్‌ల ప్రకారం ఎప్పటికప్పుడు సిలబస్ పూర్తి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు అర్థమవుతున్నది లేనిది, ప్రతిరోజు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేస్తున్నదీ లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

పానిరంగని గ్రామం వద్ద గోతుల మయమైన అరకు విశాఖ రోడ్డు

# ప్రమాదకరంగా అరకు- విశాఖ రోడ్డు

### -గోతుల్లో పడి గాయాలపాలవుతున్న వాహనదారులు

**ప్రజాశక్తి- అరకులోయ:**పర్యాటక కేంద్రమైన అరకు -విశాఖ ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఏజెన్సీ ముఖద్వారంలోని చిలకల గడ్డ నుంచి రోడ్డుకు కోతకు గురైంది. అరకులోయ సమీపంలోని పానిరంగని గ్రామం నుంచి అరకు -విశాఖ ప్రధాన రోడ్డులో గోతుల మయమై అనేక ప్రమాదాలకు దారితీస్తుంది. ఈ గోతులను పూడ్చాలని ఎన్ని మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. శనివారం ఓ ద్విచక్ర వాహనదారుడు వాహనం టైర్లు గోతులో దిగి అదుపుతప్పి బోల్తాపడడంతో తీవ్ర గాయాలు పాలై ఆసుపత్రి పాలయ్యాడు. ఇటువంటి సంఘటనలు అనేకం జరిగినా అధికారుల నుంచి ఎటువంటి స్పందన రాక పోవడంతో వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును వెంటనే మరమ్మతు చేసి గోతులు పూడ్చివేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

గాయపడిన వాహన చోదకుడు

## జిల్లాకు అభివృద్ధి నిధులు కేటాయించాలి

**ప్రజాశక్తి-పాడేరు:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అల్లూరి సీతారామరాజు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంగా పాడేరు ఎమ్మెల్యే నివాస క్యాంప్ కార్యాలయంలో జిల్లా పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక సమావేశం అల్లూరి సీతారామరాజు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం శాసన సభ్యులు మత్స్యరస విశ్వేశ్వరరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు నిధులు కేటాయించకపోవటంపై వారు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. గిరిజనుల అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేదా! నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యనికి కారణంగా ఏమిటో కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. తక్షణమే రోడ్డు, మంచి నీరు సౌకర్యంకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.గిరిజన ప్రాంతం మైదాన ప్రాంతం కన్నా అభివృద్ధిలో ఆమడ దూరంలో ఉందని, వాటిని దృష్టిలో ఉంచుకొని గిరిజన ప్రాంతంలో ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాలో వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులకు కక్ష పూరితంగా నిధులు కేటాయింపు చేయడం పోవడం అన్యాయమన్నారు.. జిల్లాకు రావాల్సిన నిధులన్నీ న్యాయబద్ధంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. నిధులు కేటాయించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతా మన్నారు. ఈ కార్యక్రమంలో.అరకు నియోజకవర్గం శాసన సభ్యులు రేగం మత్స్యలింగం, అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజ రాణి, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఛైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైసీపీ యూత్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ హాజరయ్యారు.

మాట్లాడుతున్న వైసిపి ప్రజాప్రతినిధులు

బోరు బావి తవ్వకం పనులను ప్రారంభిస్తున్నఎంపిపి లక్ష్మి, సర్పంచ్ సంతోష్‌కుమార్

## తాగునీటి బోరు తవ్వకం పనులు ప్రారంభం

**ప్రజాశక్తి-విఆర్.పురం**

మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ పరిధి చొక్కానపల్లి ఎస్టీ గుంపులో తాగునీటి బోరు తవ్వకం పనులను ఆదివారం ఎంపిపి కారం లక్ష్మి ఆ గ్రామ సర్పంచ్ పులి సంతోష్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అలాగే శ్రీరామగిరి గ్రామంలో తాగునీటి పథకానికి కొత్త మోటారును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి, సర్పంచ్ మాట్లాడుతూ ఎస్టీ గుంపులో మంచి నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను గుర్తించి మండల పరిషత్ నిధుల మంజూరు చేసి తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శ్రీరామగిరిలో మోటార్ పాడైపోవడంతో ఎంపీపీ నిధుల నుంచి కొత్త మోటర్ కొనుగోలు చేసి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఏ సమస్యలుంటే తమకు తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తామని ఎంపిపి తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గొంది దారయ్య, పూసం రవివర్మ, సున్నం సీతమ్మ, నాయకులు తోడం రాజు, గుండిపూడి లక్ష్మణరావు, ఆత్మకూరు కాంతారావు, శ్రీరపు తాతబాబు, సోడి మల్లయ్య, తోడం మంగమ్మ, సోడి శ్రీను, నాళ్ళారపు చంద్రరావు, నాళ్ళారపు సత్యనారాయణ, తుమ్మలపల్లి నాగేశ్వరావు, బాలు, పోషిబాబు, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి-రంపచోడవరం**

రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యాన మండల కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ టివి.సుబ్బరావు, డాక్టర్ దాసరి ఉమ మహేష్, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ సంపత్ కుమార్ 150మందికి వైద్య సేవలు అందించారు. 58 మందికి రక్తపరీక్షలు, 8 మందికి థైరాయిడ్ పరీక్షలు, 15మందికి ఫిజియోథెరపీ, ఒకరికి ఇసిజి చేశారు. ఈ వైద్య శిబిరంలో రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్, మేనేజర్ స్వామి రఘువీరానంద మహారాజ్, స్వామి గబీరాత్మనందజీ మహారాజ్, క్యాంప్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి అప్పారావు, మరియు సిబ్బంది పాల్గొన్నారు. రోగులకు, సహాయకులు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు.

## గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-చింతూరు**

రోడ్డు ప్రమాదంలో వెన్నుముక విరిగి గాయపడిన వ్యక్తికి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. చింతూరు మండలం చదలవాడ పంచాయతీ పరిధి శిరసనపల్లి గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన యువకుడు మడివి శేఖర్‌కు గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెన్నెముక విరిగింది. కాకినాడ జిజిహెచ్‌లో వైద్యం అనంతరం స్వగ్రామానికి తరలించారు. అనంతరం జెకెసి ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్‌ను సంప్రదించగా, కాకినాడ నుంచి స్వగ్రామానికి రావడానికి అయిన ఖర్చు నిమిత్తం రూ.10వేలు తక్షణ సాయం కింద ఫోన్ పే ద్వారా అందజేశారు.

గాయపడిన శేఖర్

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి

## గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

**ప్రజాశక్తి - చింతపల్లి :-** గిరి గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తున్నామని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షురాలు దురియా పుష్పలత అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ, మండలంలోని 17 పంచాయతీల పరిధిలోని గిరి గ్రామాలలో సిమెంటు రహదారి నిర్మాణ పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపనలు చేయడం జరుగుతుందన్నారు. మండల ప్రజా పరిషత్తు నిధులతోనే అధికంగా సిమెంటు రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందని ఎంపీపీ పేర్కొన్నారు.

## ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించండి

**ప్రజాశక్తి-పాడేరు:** పాడేరు డివిజన్లోని 11 మండలాలకు చెందిన ఏఎన్ఎంలు పాడేరు గిరిజన భవన్లో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో దసలవారీగా నిరసన కార్యక్రమాలు తెలియజేస్తామని వారు తెలియజేశారు. గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్నామనీ అనేక సమస్యలతో బాధపడుతున్నామన్నారు. ఈ విషయమై పలుమార్లు డీఎం అండ్ హెచ్ ఓ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, సమస్య నేటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. ఈ నెలలో రెండవ ఏ ఎన్ ఎం లకు 22000 జీతం రావాల్సి ఉండగా కేవలం 600 రూపాయలు అకౌంట్ లో పడిందని, దీంతో నెలంతా ఎలా బతకాలో అర్థం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫేషియల్ హాజరు నుండి ఫీల్డ్ సిబ్బందికి మినహాయింపు నివ్వాలన్నారు. యప్స్, ఆన్లైన్ వర్క్‌లతో పని భారం ఎక్కువైందని తెలిపారు.అధికారుల తీరుకు నిరసనగా ఈ నెల 15న పాడేరులో నిరసన తెలియజేయ జేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంల సంఘం నాయకులు పుష్ప, ముక్తమ్మ, కుమారి, భవాని, అంబిక, పార్వతి, వరలక్ష్మి, శెట్టి నాగరాజు 11 మండలాల ఏఎన్ఎం లు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీలో జిల్లాకు ప్రథమ స్థానం

**ప్రజాశక్తి-పాడేరు:** పించన్ల పంపిణీలో జిల్లా మరోసారి ప్రథమ స్థానం సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలలతో పాటు అక్టోబర్ నెలలో కూడా పింఛన్ల పంపిణీలో మొదటి స్థానం సాధించి హ్యాట్రిక్ సాధించడం పట్ల సంబంధిత అధికారులను కలెక్టర్ అభినందించారు. జిల్లాలో 1,24,354 మంది లబ్దిదారులకు రూ. 51,79,56,000లు పించన్లు విడుదల కాగా 1,23,706 మందికి రూ. 51,52,75,500లు పంపిణీ చేసి 99.48 శాతం పంపిణీతో అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పించన్ల పంపిణీని నిరంతరం పర్యవేక్షించిన డిఆర్డిఎ పిడి వి.మురళిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

# 8 కిలోమీటర్లు డోలీ మోత

- భారీ వర్షాలకు కొట్టుకుపోయిన బూసుకొండ మట్టి రహదారి
- రెండు నెలలు కావస్తున్నా పునరుద్ధరణ కాని వైనం
- అంబులెన్స్ వెళ్లే పరిస్థితి లేక తప్పని తిప్పలు

డోలీ మోత సహాయంతో రోగిని తరలిస్తున్న బంధువులు

**ప్రజాశక్తి-సీలేరు**

మారుమూల గ్రామాల్లో గిరిజనులకు రహదారి సౌకర్యం లేక డోలీ మోతలు తప్పడం లేదు. జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ బూసుకొండ గ్రామానికి చెందిన జర్త కాసులమ్మ శనివారం రాత్రి జ్వరం, వాంతులు, కడుపునొప్పితో బాధపడుతూ తీవ్ర అనారోగ్యానికి గురైంది. సరైన రహదారి సౌకర్యం లేక అంబులెన్స్ గ్రామానికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు డోలీ కట్టి కాలినడకన ఎనిమిది కిలోమీటర్లు మోసుకుంటూ ప్రధాన రహదారికి తీసుకొచ్చారు. అక్కడ నుండి అంబులెన్స్‌లో సప్పర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో ఆస్పత్రి సిబ్బంది వైద్య సేవలు అందించారు.

**భారీ వర్షాలకు కొట్టుకుపోయిన మట్టి రహదారి**

ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో గతంలో గ్రామానికి మట్టి రహదారి నిర్మించారు. సెప్టెంబర్ నెలలో వచ్చిన వరద ముప్పు వలన బూసుకొండ రహదారిపై కొండ చరియలు విరిగి పడి బండరాళ్లు, చెట్లు, మట్టి దిబ్బలు పేరుకుపోయాయి. వాటిని నేటికీ తొలగించలేదు. కొన్ని చోట్ల రహదారి పూర్తిగా కొట్టుకుపోగా పునరుద్ధరణ చర్యలు చేపట్టలేదు. దీంతో గ్రామానికి అంబులెన్స్ కూడా రాలేని దుస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే డోలీ మోతలు తప్పడం లేదు. పరిస్థితి విషమిస్తే మరణం తప్ప మరో మార్గం లేని దుస్థితి.

**రహదారి పునరుద్ధరణ చేపట్టాలి : ఎంపిటిసి బుజ్జిబాబు**

బూసుకొండ రహదారిపై పేరుకుపోయిన బండరాళ్లు, చెట్లు, మట్టి దిబ్బలను తొలగింపునకు, కొట్టుకుపోయిన చోట మరమ్మతులకు చర్యలు చేపట్టి రహదారి సౌకర్యం కల్పించాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపురంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటనలు చేయడం తప్ప ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. అనారోగ్యానికి గురైన ఇదే గ్రామానికి చెందిన ఓ యువకుడిని రహదారి సౌకర్యం లేక సకాలంలో ఆసుపత్రికి తరలించలేకపోవడంతో ఆ యువకుడు మృత్యువాత గురయ్యాడని గుర్తు చేశారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల పట్ల అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఓ స్పందించి గిరిజన గ్రామాలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని, బూసుకొండ రహదారిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

# ఆర్‌వి.నగర్-పాలగెడ్డ బిటి రోడ్డుకు నిధులు మంజూరు

### ఆర్ అండ్ బి చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి

**ప్రజాశక్తి-సీలేరు**

జికె.వీధి మండలం ఆర్‌వి.నగర్ నుంచి పాలగెడ్డ వరకు నూతనంగా బీటీ రోడ్డు నిర్మించడానికి ప్రభుత్వం రూ.33 కోట్లు మంజూరు చేసినట్లు ఆర్ అండ్ బి చీఫ్ ఇంజినీర్ ఎల్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సెప్టెంబర్ నెలలో వరదలకు ఆర్‌వి నగర్ నుంచి సీలేరు వరకు కొట్టుకుపోయిన రహదారి, వంతెనలు, కల్వర్టులను ఆదవారం ఆయన పరిశీలించారు. అనంతరం సీలేరు బాలాజీ లాడ్జిలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో నూతనంగా రహదారులు నిర్మాణానికి, గుంతలు పూడ్చడానికి ప్రభుత్వం రూ.46 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇందులో ఆర్‌వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు నూతనంగా బీటీ రహదారి నిర్మాణానికి రూ.33 కోట్లు, రంపచోడవరం, మారేడుమిల్లి మండలాలకు రూ.13 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. దీనికి సంబంధించిన టెండర్ ప్రక్రియ నవంబర్ 18 నాటికి పూర్తవుతుందని వెల్లడించారు. వర్షాలు పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టిన పట్టిన తరువాత బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. ఆర్‌వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు రెండు లేయర్లు బీటీ రోడ్డు వేయవలసి ఉందని, వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ పనులు పూర్తవుతాయని చెప్పారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఆర్‌వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు డబల్ లైన్ బిటి రోడ్డు నిర్మాణానికి రూ.84 కోట్లు మంజూరు చేయగా, అప్పట్లో అటవీశాఖ క్లియరెన్స్ లేకపోవడంతో రహదారి పనులు నిలిచిపోయాయని గుర్తు చేశారు. అనంతరం సీలేరు నుంచి వలసగెడ్డకు చేరుకుని వరదలకు దెబ్బతిన్న వంతెనను, ప్రధాన రహదారిలో పాలగెడ్డ చివరి వరకు ఏర్పడిన పెద్ద పెద్ద గోతులు పరిశీలించారు. కార్యక్రమంలో వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి ఎంపిటిసి కరక వెంకటరమణ, సీలేరు స్థానిక సర్పంచ్ పాంగి దుర్జు, కాంగ్రెస్ నాయకులు కారే. శ్రీనివాస్, వి.అప్పారావు, బాలాజీ లాడ్జి ఓనర్ నక్క జ్ఞానేశ్వర్‌రావు, ఆర్ అండ్ బి ఈఈ బాల సుందర బాబు, ఆర్ అండ్ బి డిఈ అప్పారావు, జెఇ భరతుడు తదితరులు పాల్గొన్నారు.

వరదలకు దెబ్బతిన్న వలసగెడ్డ వంతెనను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు

## నేడు గిరిజన శాఖ మంత్రి పర్యటన

**ప్రజాశక్తి-పాడేరు :** రాష్ట్ర గిరిజన సంక్షేమ మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈనెల 4న జిల్లాలో పర్యటించనున్నారు. ముందుగా బంగారమ్మపేట గ్రామంలో దీపం 2 కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులతో ముచ్చటిస్తారు. సుండ్రుపుట్టులో మిషన్ పాట్ హెూల్ ఫ్రీ కార్యక్రమంలో పాల్గొంటారు. కుమ్మరిపుట్టు గిరిజన సంక్షేమ పాఠశాలలో కిషోరి వికాశం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం విశాఖపట్నం బయలుదేరి వెళ్తారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి కార్యక్రమం షెడ్యూల్ విడుదల చేశారు.

## రోడ్డు పనులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి -పాడేరు:** బక్కులపనుకు శృంగం రోడ్డు పనులను సర్పంచ్ ఉషారాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు, వార్డ్ మెంబర్ గోపాలకృష్ణారావు(అబ్బాస్), వార్డ్ మెంబర్ వర్ధన లక్ష్మి, మాజీ సర్పంచ్ పిన్నెల దొర, కార్ యూనియన్ ప్రెసిడెంట్ నాయుడు, కాంట్రాక్టర్ నూకరాజు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో టిడిపి నాయకులు

## టిడిపి సభ్యత్వ నమోదు

**ప్రజాశక్తి- చింతపల్లి :-** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమం మండలంలో చురుగ్గా సాగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, చింతపల్లి, కిటుములు, అంజలి శనివారం పంచాయతీలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఆదివారం ఒక్కరోజే చింతపల్లి పంచాయతీలో 44 ,కిటుముల పంచాయతీలో 38, అంజలి శనివారం పంచాయతీలో ఏడు సభ్యత్వాలు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు మండలంలో 1400 సభ్యత్వాలు నమోదు చేసినట్టు పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవ, మహేంద్ర, రాధాకృష్ణ, వెంకటరావు పాల్గొన్నారు.

## 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

**ప్రజాశక్తి -నక్కపల్లి:**పాయకరావుపేట గ్రంథాలయంలో ఈనెల 14 నుండి 20 వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని గ్రంథాలయ అధికారి వామాల లక్ష్మణరావు తెలిపారు. పాయకరావుపేట గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాల నిర్వాహణపై తెలుగు ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్. ఆచార్యులు, గ్రంథాలయ కమిటీ సభ్యులు నాగం సీతారామమూర్తి, పల్లపోలు సత్యనారాయణ, అచ్యుతరావు, తేజోమూర్తుల వేంకటేశ్వరరావు, ధనిశెట్టి తులసి ,కేశనపల్లి సత్తిబాబు, పాఠకులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాలు ఏ విధంగా నిర్వహించాలనే దానిపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ, వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, డిపాజిట్లు సేకరించడం, విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ముగింపు రోజున బహుమతులను అందజేయనున్నట్లు వెల్లడించారు.

**చదవడం మాకిష్టం కార్యక్రమం**

**ప్రజాశక్తి-గొలుగొండ:**స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో స్టోరీ టెల్లింగ్, బుక్ రీడింగ్ నిర్వహించారు. గ్రంథాలయాధికారి రాజుబాబు మాట్లాడుతూ, ప్రతీ ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలకు రావడం అలవాటు చేసుకోవాలన్నారు.

# పర్యాటక ప్రదేశాలు కిటకిట

చాపరాయి వద్ద పర్యాటకులు

**ప్రజాశక్తి -డుంబ్రిగుడ:** మండలంలో పర్యాటక ప్రాంతాలైన చాపరాయి జలపాతం, అంజోడా సిల్క్ ఫారంలో అరకు పినారి పర్యాటక ప్రదేశాల్లో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. దీంతో, ఆ పర్యటక ప్రదేశాల్లో వాహనాలతో రద్దీ ఏర్పడింది. చాపరాయి జలపాతంలో కుటుంబ సమేతంగా చిన్న పెద్ద తేడా లేకుండా జలకాలు స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. జలపాతంలో ఏర్పాటు చేసిన గార్డెన్లో ఫొటోలు తీయించుకుంటూ సందడి చేశారు. అటవీ శాఖ ఏర్పాటు చేసిన అరకు పినారిలో కూడా సందర్శించిన పర్యాటకులు అక్కడి అందాలను తిలకించారు. అరకు నుంచి జైపూర్ జంక్షన్ మీదుగా చాపరాయి జలపాతం వరకు రోడ్డు కిరువైపులా ఉన్న వలిసె తోటల్లో, బంతిపూల, పొద్దుతిరుగుడు తోటల్లో ఫోటోలు తీసుకుంటూ పర్యాటకులు మంచి అనుభూతిని పొందారు. అంజోడా సిల్క్ ఫారం అరకు పినారి నుంచి చాపరాయి జలపాతం వరకు అడుగడుగున పర్యాటకులు సందడి చేశారు. చిరు వ్యాపారాలు బాగా జరగడంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు.

పూల మధ్య పర్యాటకులు

# ఆకర్షిస్తున్న ‘ మీనా రిసార్ట్స్’

అందంగా ఉన్న రిసార్ట్

**చింతపల్లి:**పర్యాటక ప్రియులకు సకల సదుపాయాలతో రిసార్ట్స్‌ను అన్ని హంగులతో ముస్తాబు చేసి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని మీనా రిసార్ట్స్ నిర్వాహకులు మీనాక్షి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ, ఆంధ్రా కశ్మీర్ గా పేరొందిన లంబసింగి, తాజంగి గ్రామాల నడుమ లబ్బంగి వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న మీనా రిసార్ట్స్‌ను నూతనంగా ముస్తాబు చేయడం జరిగిందన్నారు. ఈ రిసార్ట్స్ లో పర్యాటకులు బస చేయడానికి గాక ఈ ప్రాంతంలో నెలకొన్న శీతల వాతావరణం, మంచు తెరల సోయగాలను ఆస్వాదించేందుకు అన్ని విధాలా మీనా రిసార్ట్స్ ను సకల సదుపాయాలతో అందుబాటు లోకి తీసుకు రావడం జరిగిందన్నారు. రిసార్ట్స్ సేవలను పర్యాటక ప్రియులంతా సద్వినియోగం చేసుకుని మన్య ప్రాంత అందాలను తిలకించాలని ఆమె కోరారు.

# నిరుపయోగంగా సంత షెడ్లు

**ప్రజాశక్తి -డుంబ్రిగుడ:**కూరగాయలు ఇతర నిత్యావసర సరుకులు విక్రయించేందుకు గాను మండల కేంద్రంలో నిర్మించిన సంత షెడ్లు ప్రస్తుతం ఉపయోగించక పోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. గత పదేళ్ల క్రితం ఇక్కడ గురువారం వారపు సంత జరిగేది. అప్పట్లో నిత్యావసర సరుకులు, కూరగాయలు విక్రయించే వారి కోసం ఐటీడీఏ సంత షెడ్లు నిర్మించింది. ప్రస్తుతం వాటిని ఎవరు వినియోగించక పోవడంతో బయట వ్యక్తులు వాటిని ఆక్రమించు కోవడానికి ప్రయత్నాలు సాగిస్తున్నారు. మండల కేంద్రంలో నిత్యం కూరగాయలను విక్రయించే వారు మెయిన్ రోడ్డు కిరువైపులానున్న రోడ్డు పక్కన విక్రయాలు సాగిస్తున్నారు. వీరికి సంత షెడ్లను అప్పగిస్తే ఉపయోగకరంగా ఉంటుందని మండల వాసులు కోరుతున్నారు. తక్షణమే అధికార్లు స్పందించి సంత షెడ్లు ఆక్రమించకుండా నిత్యం కూరగాయలు విక్రయించే వారికి అప్పగించే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

శిథిలమైన సంత షెడ్డు

**నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా...**

# నక్కపల్లిలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు తగదు

### నిర్వాసితుల పోరాట కమిటీ నాయకులు

**ప్రజాశక్తి -నక్కపల్లి:**వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించకుండా నక్కపల్లిలో స్టీల్ ప్లాంట్ ఎలా ఏర్పాటు చేస్తారని నిర్వాసితుల పోరాట కమిటీ నాయకులు ప్రశ్నించారు. మండలంలోని చందనాడ గ్రామంలో ఆదివారం కారిడార్ నిర్వాసితులు పోరాట కమిటీ సమావేశం జరిగింది. నిర్వాసితుల సమస్యల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నక్కపల్లి మండలంలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరిట సేకరించిన భూముల్లో ఆర్సెలాల్ మిట్టల్, విప్పన్ స్టీల్స్ సంయుక్తంగా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటించాలని, నిర్వాసితుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం చేయకుండా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.పరిశ్రమలు, అభివృద్ధి ఎంత ముఖ్యమో ఆ పరిశ్రమలు ఏర్పాటుకు భూములు ఇచ్చి, తమ జీవితాలు త్యాగం చేస్తున్న నిర్వాసితులను ఆదుకోవడం కూడా అంతే ముఖ్యమని ముఖ్యమంత్రి కి తెలియదా అని ప్రశ్నించారు. ఇల్లులు కోల్పోతున్న టువంటి వారికి నేటికీ ఎక్కడ పునరావసం కల్పిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయలేదని, ఏ సంవత్సరానికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇస్తారో, ఎంత చెల్లిస్తారో నేటికీ తెలపలేదని, అంతేకాకుండా అనేకమంది పేద సాగుదారులు సాగు చేసుకుంటున్న భూములకు పరిహారం చెల్లించలేదన్నారు. చట్ట ప్రకారం చెట్లకు, నిర్మాణాలకు, బోరు బావులకు చెల్లించాల్సిన పరిహారం పూర్తిస్థాయిలో చెల్లించలేదన్నారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. పరిశ్రమల వ్యర్థ, రసాయన జలాలు సముద్రంలో కలవడంతో చేపలు మృత్యువాత పడతాయని, దీంతో వృత్తి కోల్పోతున్న మత్స్యకారులను, ఉపాధి కోల్పోతున్న రైతులు, కూలీలు, వివిధ వత్తిదారులను ఏ విధంగా ఆదుకుంటారో తెలియచేయకుండా పరిశ్రమలు ఏర్పాటుకు సన్నాహాలు చేయడం నిర్వాసితులను మోసగించడమే అవుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, నాయకులు ఎం.సత్యనారాయణ, టి.అప్పలస్వామి, గోవిందరావు, ఎస్.చిన్న, ఆర్.అప్పారావు, యు రమేష్, పి.చిన్నతాత, టి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

## తీరప్రాంతంలో సరుగుడు తోట నరికివేత

**ప్రజాశక్తి- ఎస్.రాయవరం:**తీర ప్రాంత గ్రామమైన బంగారమ్మపాలెం దరి కాపుల వాతాడ తీరంలో సరుగుడు తోట నరికివేతపై గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన మల్లి రమణ, మైలపల్లి శ్రీను, కాపులవాతాడ గ్రామస్థులు ఇచ్చిన వివరాల ప్రకారం... కాపులవాతాడ గ్రామం తీర ప్రాంతంలో అటవీ శాఖకు చెందిన భూముల్లోని సరుగుడు తోటను బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన కొంతమంది అక్రమంగా నరికించి అమ్మకం పెట్టారన్నారు. సుమారు నాలుగు లక్షల విలువ చేసే కలపను వీరు తరలించేందుకు సిద్ధపడుతుండటంతో గ్రామస్థులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయమై యలమంచిలి అటవీ శాఖాధికారి అనిల్ కుమార్‌ను వివరణ కోరగా.. చెట్లను నరికిన వారు అవి తమ భూములకు సంబంధించినవని, వాటి పత్రాలు చూపిస్తామన్నారన్నారు. సోమవారం వాటిని పరిశీలించి, అటవీ భూముల్లో చెట్లను నరికితే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు.

## చోరీపై ఫిర్యాదు

**ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:** తన ఇంటిలో సైకిల్ దొంగతనం పై ఫిర్యాదు చేసినట్లు జై భీమ్ రావ్ భారత్ పార్టీ అనకాపల్లి జిల్లా ప్రెసిడెంట్ నేతల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మున్సిపాలిటీ కృష్ణ బజార్ ఎస్బిఐ బ్యాంక్ ఎదురుగా శ్రీ సంపత్ వినాయక క్లినికల్ లేబరేటరీ మేడ పైన నివాసముంటున్నామని తెలిపారు. అక్టోబరు 30న రాత్రి తమ ఇంటి వద్ద ఉంచిన సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు

## ఘనంగా గ్యార్మీ షరీఫ్ పండగ

**ప్రజాశక్తి-రోలుగుంట:**ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే గ్యార్మీ షరీఫ్ పండుగను ఆదివారం రోలుగుంట మండలం నిండుగొండ గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. ఇక్కడ ప్రత్యేక ఇమాములచే ప్రత్యేక బయాన్ ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులతో పాటు సోదరీమణులు కూడా అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం వచ్చిన వారందరికి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఉపకార్ కప్ విజేతలకు బహుమతులు

**ప్రజాశక్తి - ఆరిలోవ :** క్రీడలతోనే మానసిక ఆరోగ్యం లభిస్తుందని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు ఆదివారం ఆరిలోవ, హెల్త్‌సిటీ మైదానంలో ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్, ఉపకార ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచర్ల అచ్యుతరావు పెద్ద కుమారుడు యశ్వంత్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఉపకార్ కప్ సీజన్-2 క్రికెట్ విజేతలకు బహుమతులను అందజేశారు. ముందుగా యశ్వంత్ చిత్రపటానికి కంచర్ల అచ్యుతరావు కుటుంబ సభ్యులు పూల మాలలు వేసి ఘణంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ, యువత చెడుదోవ పట్టకుండా ఇటువంటి క్రీడలను ప్రోత్సాహించడం అభినందనీయమని,కంచర్ల అచ్యుతరావు చేస్తున్న క్రీడా, సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని క్రీడలను నిర్వహిస్తామన్నారు.ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.కార్యక్రమంలో ఈస్ట్ ఎసిపి లక్ష్మణమూర్తి, సినీహీరో కంచర్ల ఉపేంద్ర, ఉపకార్ ట్రస్టు మేనేజర్ సుధీర్ కుమార్, సభ్యులు అరుణ, అనిత, పద్మ పాల్గొన్నారు.

## రాములోరి భూమిని రక్షించాలి

### - దొంగపత్రాలతో అమ్మిన వారిని శిక్షించాలని అఖిలపక్షం నిరసన

**ప్రజాశక్తి -మధురవాడ :** కొమ్మాదిలో సర్వే నెంబరు 84లో 31 సెంట్లు శ్రీరాముని దేవాలయం భూమిని దొంగ పత్రాలు సృష్టించి అమ్మినవారిని గుర్తించి కఠినంగా శిక్షించి, రాములోరి భూములను కాపాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. ఆదివారం అన్యాక్రాతమైన భూమిలో కొమ్మాది గ్రామస్తులతో కలిసి సిపిఐ, సిపిఎంతోపాటు అఖిలపక్ష పార్టీల నేతలు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులలో శ్రీరాముని దేవాలయం భూమిగా స్పష్టంగా ఉన్నప్పటికీ, గతనెల 26న పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు నెంబర్లు 7762, 7764 /2004తో 750 గజాలు చొప్పున దొంగ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. మధురవాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండగా పెదగంట్యాడలో చేయించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దీన్ని బట్టి ఇది దొంగపనిగానే స్పష్టమౌతోందన్నారు.
సిపిఐ, సిపిఎం ఏరియా కార్యదర్శులు వి సత్యనారాయణ, డి అప్పలరాజు మాట్లాడుతూ దేవాలయ భూముల అన్యాక్రాంతంలో స్థానికుల ప్రమేయం ఉండే ఛాన్స్ ఉందని, దీనిపై విచారణ జరిపించాలని కోరారు. నిరసనలో సిపిఐ నేతలు ఎండి బేగం, కె కుమార్, ఎంఎస్ పాత్రుడు, కె చిన్న, సిపిఎం నాయకుడు సియ్యాద్రి పైడితల్లి, కొమ్మాది గ్రామ టిడిపి నేత, న్యాయవాది గొలగాని సన్యాసిరావు, వైసిపి నేత సియ్యాద్రి కనకరాజు పాల్గొన్నారు.

## శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీగా కృష్ణకుమార్

**ప్రజాశక్తి- వేపగుంట :** శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఆత్మకూరి శంకరరావు పెద్ద కుమారుడు కృష్ణకుమార్‌ను ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీగా నియమించారు. శంకర్ ఫౌండేషన్ బోర్డు చైర్మన్ ఎం.రాందాస్ అధ్యక్షతన జరిగిన ట్రస్ట్ బోర్డు సమావేశంలో నిర్ణయించారు. ఆంధ్రా యూనివర్సిటీ నుండి అప్లైడ్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీని చేసిన కృష్ణకుమార్ 13ఏళ్లపాటు శంకర్ ఫౌండేషన్ బోర్డులో పనిచేశారు. మేనేజింగ్ ట్రస్టీగా కృష్ణకుమార్ నియామకంపె ఆసుపత్రి డాక్టర్లు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. కృష్ణకుమార్ హయాంలో శంకర్ ఫౌండేషన్ మరింత పురోభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు. ప్రొఫెసర్ ఎ ప్రసన్నకుమార్, ఆత్మకూరి కృష్ణకుమార్, ఆత్మకూరి విజయకుమార్ వ్యక్తిగతంగానూ, ఆత్మకూరి రాంకుమార్ అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటును వినియోగించుకోవాలి

**ప్రజాశక్తి- ఆనందపురం:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కును సద్వినియోపరుచుకోవాలని ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు గంగాధరుడు అన్నారు ఆదివారం లొడగలవానిపాలెం ఎంపిపి పాఠశాలలో నిర్వహించిన యూనియన్ సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో అల్లూరి జిల్లా సెక్రటరీ మురళి, గౌరవాధ్యక్షులు బాబూరావు, జనరల్ సెక్రటరీ రమేష్, జిల్లా సెక్రటరీ చంద్రకళ, శ్రీదేవి, ఈశ్వరరావు, ఉమామహేశ్వరరావు , అప్పన్నబాబు పాల్గొన్నారు.

## చురుగ్గా టిడిపి సభ్యత్వ నమోదు

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** జివిఎంసి మూడో వార్డు తోట వీధిలో ఆదివారం టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పాల్గొని, పార్టీ సభ్యత్వం పొందడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చురకల రమణ, ఎం సంజీవ్ కుమార్, ఎ గురు నాథ్ పాల్గొన్నారు.

# పోరాటాలతో పోర్టు ఆసుపత్రిని కాపాడుకుంటాం

**ప్రజాశక్తి - సీతమ్మధార :** విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని పిపిపికి ఇవ్వడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని, . పెద్దఎత్తున ఉద్యమాలు చేసి కాపాడుకుంటామని సిఐటియు పోర్ట్‌యూనియన్ అధ్యక్షులు జె.సత్యనారాయణ స్పష్టం చేశారు. పోర్టు ఆసుపత్రిని పిపిపికి అప్పగించి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి అభివృద్ధి చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోర్టు ఆసుపత్రికి వద్ద నిర్వహిస్తున్న రిలేదీక్షలు ఆదివారం 34వ రోజుకు చేరిన సందర్భంగా మాట్లాడుతూ, కైలాసపురంలో 80 పడకలతో ఉన్న పోర్టు ఆసుపత్రిని రూ.222.43 కోట్లతో పిపిపి విధానంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలనే కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ ప్రతిపాదన విరమించుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. పోర్టు ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబసభ్యుల వైద్యం ఖర్చు తగ్గించడానికే ఈ ప్రతిపాదన అంటూ కేంద్రమంత్రి సోనోవాల్ ప్రతిపాదన ఒట్టి బూటకమన్నారు. దీనివల్ల పోర్టు కార్మికులకు వైద్యం దూరమౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిపిపి పద్ధతిలో గంగవరం పోర్టు, విశాఖ పోర్టులోని బెర్త్‌లను కార్పొరేట్లకు కట్టబెడితే ఏం జరిగిందో అందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలను విడనాడి, పోర్టు నిధులతోనే ఆసుపత్రిని అభివృద్ధి చేసి, మెరుగైన వైద్యసదుపాయాలను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షలో సిఐటియు నాయకులు బి జగన్, బి లక్ష్మణరావు, కె.సత్యనారయణ, సిహెచ్ త్రినాధరావు, కెఎస్ కూమార్, ఈశ్వరరావు, శంకరరావు, గణేష్ రాము, నరసింహామూర్తి పాల్గొన్నారు.

రిలేదీక్షల్లో పాల్గొన్న సిఐటియు నేతలు, కార్మికులు

# పసికందుకు ఎక్మోతో గుండె ఆపరేషన్

### రెండు నెలల బాబు ప్రాణాలు కాపాడిన వైజాగ్ కిమ్స్ కడల్స్ వైద్యులు

ఆపరేషన్ జరిగిన చిన్నారితో కిమ్స్ కడల్స్ వైద్యులు

**ప్రజాశక్తి- గాజువాక :** రెండు నెలల వయసు, కేవలం 2.7 కిలోల బరువున్న బాబు అరుదైన గుండె వ్యాధికి ఎక్మోతో సంక్లిష్టమైన ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించి వైజాగ్ కిమ్స్ కడల్స్ వైద్యులు ప్రాణదానం చేశారు. దీనికి సంబంధించి ఆసుపత్రి చీఫ్ నియోనాటాలజిస్ట్, నియోనాటాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ తెన్నేటి, చీఫ్ ఇంటెన్సివిస్ట్, పీడియాట్రిక్ ఐసియు విభాగాధిపతి డాక్టర్ రౌతు సంతోష్ కుమార్ తెలిపిన వివరాలివి.
సాధారణంగా ఊపిరితిత్తుల్లో శుద్ధిచేసిన రక్తాన్నిరక్తనాళాల ద్వారా గుండెలోని ఎడమ కర్ణికకు వెళ్లి, అక్కడి నుంచి శరీరం మొత్తానికి సరఫరా కావాలి. కానీ, ఈ బాబుకు రక్తం కుడివైపు గుండె గదిలోకి వెళ్లి, అక్కడ శుద్ధి చేయని రక్తంతో కలిసిపోవడంతో శరీరానికి తగినంత రక్తసరఫరా జరగడం లేదు. వైద్య పరిభాషలో టోటల్ అనామలస్ పల్మనరీ వీనస్ కనెక్షన్ (టిఎపివిసి) అంటారని,. ప్రతి లక్ష మంది పిల్లల్లో కేవలం 6 నుంచి 12 మందికి మాత్రమే పుట్టుకతోనే ఈ సమస్య ఉంటుందన్నారు.
దీంతో బాలుని ప్రాణాలను కాపాడే క్రమంలో ఆక్సిజన్ స్థాయి పెంచడానికి ముందుగా సెంట్రల్ ఎక్మో పెట్టామని, . తర్వాత ఓపెన్ హార్ట్‌సర్జరీని నిర్వహించి, బాలుని ప్రాణాలను కాపాడామన్నారు. చిన్నపిల్లలకు ఎక్మో పెట్టడం చాలా సవాళ్లతో కూడుకున్నదైనా, అన్ని విభాగాల వైద్యులు పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించి, బాలుని ప్రాణాలను కాపాడడంపై ఆనందం వ్యక్తం చేశారు.
ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో ఇలాంటి అసాధారణ ఆపరేషన్ చేయడం అరుదని, ఈ ఘనత సాధించడం కిమ్స్ కడల్స్ ఆస్పత్రి వైద్యబృందం అసాధారణ నైపుణ్యాలు, నిబద్ధతకు నిదర్శనమన్నారు. డాక్టర్ నిఖిల్ తెన్నేటి, డాక్టర్ ఆర్. సంతోష్‌కుమార్, డాక్టర్ రవికృష్ణ నేతత్వంలోని నియోనాటల్ వైద్యబృందంతోపాటు క్రిటికల్ కేర్, ఇతర విభాగాల బృందం అత్యున్నత సేవలందించి బాబు ప్రాణాలు కాపాడింది. డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ సాయి మణికందన్, డాక్టర్ శాంతిప్రియలతో కూడిన గుండె శస్త్రచికిత్స నిపుణుల బందం శస్త్రచికిత్స నిర్వహించిందన్నారు.

## అలరించిన ‘ఫ్రెండ్స్ క్లబ్’ కామెడీ స్కిట్స్

**ప్రజాశక్తి-సీతమ్మధార :** ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పౌరగ్రంథాలయంలో వినోదాలు విందు కామెడీషో స్కిట్స్ ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. పెళ్ళాం ఊరెళితే, తాగుబోతు రమేష్, బ్యాంక్ మేనేజర్, ఫ్రెండ్స్ ఇంటికి వస్తే భార్య రియాక్షన్, మొదలగు స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించాయి.
ఈ సందర్భంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వ్యవస్థాపకులు ఎంవి సత్యనారాయణ మాట్లాడుతూ నవ్వుతోనే మనిషి ఆరోగ్యకరంగా ఉంటారని, ఆ నవ్వును అందించడం కోసమే ప్రతినెలా మొదటి ఆదివారం వినోద్ కామెడీ షో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హాస్యప్రియ కామెడీ క్లబ్ అధ్యక్షులు ఈమంది ఈశ్వరరావు అడవిరాజు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.


స్కిట్లో హాస్యం పండిస్తున్న కళాకారులు

## ‘ఆంధ్రప్రదేశ్ శాసనాలు’ పుస్తకావిష్కరణ

**ప్రజాశక్తి- సీతమ్మధార :** సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరి సంయుక్త నిర్వహణలో ఎయు చరిత్ర, పురావస్తుశాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యులు సి. సోమసుందరరావు రచించిన ఇన్‌స్క్రిప్షన్స్ ఆప్ ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రదేశ్‌లోని శాసనాలు) పుస్తకావిష్కరణ జరిగింది.క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దం నుంచి తెలుగు రాష్ట్రాల్లో ఆనాటి పాలకులు, రాజులు ఇచ్చిన శాసనాలను, అప్పటి లిపి పుట్టుపూర్వోత్తరాలు, పరిణామక్రమాన్ని పుస్తకంలో పొందుపరిచారు.సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ అధ్యక్షులు ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ అధ్యక్షతన, ఆచార్య కొల్లూరు సూర్యనారాయణ పుస్తకం పరిచయం చేశారు. మల్లంపల్లి సోమశేఖర్‌శర్మ చారిత్రిక అధ్యయన సంస్థ కార్యదర్శి శంకర్‌నీలు భాగవతుల స్వాగతం పలికారను. పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డిఎస్. వర్మ చరిత్రకారులు తిమ్మారెడ్డి, రాణి శర్మ, రచయితలు బేతవోలు రామబ్రహ్మం, ద్విభాష్యం రాజేశ్వరరావు, డివి సూర్యరావు, గండికోట విశ్వనాథం, సి. సూర్యలక్ష్మి పాల్గొన్నారు

## వైజాగ్ ఫిలిం సొసైటీ

## నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

**ప్రజాశక్తి- సీతమ్మధార :** వైజాగ్ ఫిలిం సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారాన్ని ఆదివారం సీతమ్మధార రైతుబజారు దరి ఆక్సిజన్ టవర్స్‌లో నిర్వహించారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ అనేక మంచి సినిమాను ప్రజలకు చేరువచేయడం, సమాజాభివృద్ధికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, నవర ప్రకాశరావు చేసిన సేవలను కొనియాడారు. సొసైటీ అధ్యక్షులు ఎ.కాశీవిశ్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో స్టార్ మేకర్ ఎల్.సత్యానంద్,కార్యదర్శి నరవ ప్రకాశరావు, ఉపాధ్యక్షురాలు ఎ.ఉషారాణి, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ బి చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్ శివకుమార్, బి గణేశ్వర బాబ్జి పాల్గొన్నారు.

## స్టీల్ క్లబ్‌లో జాతీయస్థాయి అబాకస్ పోటీలు

పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో నిర్వాహకులు

**ప్రజాశక్తి -ఉక్కునగరం :** అబాకాస్ పోటీలతో విద్యార్థుల ఆలోచనలు పదునుదేరి, సృజనాత్మకత మరింత మెరుగవుతుందని ఉక్కు సిజిఎం(వర్క్స్) శ్రీధర్ అన్నారు. ఆదివారం ఉక్కునగరం స్టీల్ క్లబ్‌లో మేథ్స్ టు మెరిట్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి అబాకస్ పోటీ పరీక్షలను జ్యోతిప్రజ్వళన చేసి ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి ఐదేళ్లలోపు 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాత పద్ధతి లేకుండా మనస్సుతో నే గణించిన విద్యార్థులను సిజిఎం శ్రీధర్ అభినందించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఈపూరి సుధారాణి మాట్లాడుతూ, 15ఏళ్లుగా క్రమం తప్పకుండా అబాకస్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. భారత్‌లోనే కాకుండా అమెరికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, కెనడా వంటి ఎన్నో దేశాలకు చెందిన వారు ఆన్‌లైన్‌లో అబాకస్ నేర్చుకుంటున్నారన్నారు. అనంతరం ఛాంపియన్ షిప్, గోల్డ్, సిల్వర్ మెడల్స్ వచ్చిన విద్యార్థులకు ముఖ్యఅతిథి శ్రీధర్ బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఈపూరి బుచ్చిరాజు, యోగేష్ కుమార్ గార్గ్, ఆకుండి రవిశంకర్ పాల్గొన్నారు.

## బాధితునికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్థానిక ఎస్‌బిఐ ఎదురుగా ఉన్న టీ దుకాణం దెబ్బతిన్న నేపథ్యంలో దాని యజమానిరాజేంద్రప్రసాద్‌కు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి, సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ సంస్థల సభ్యులు ఆదివారం రూ 17, 500 ఆర్థికసాయం చేశారు. వారికి రాజేంద్రప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.